

రౌడీలూ.. తీరు మారాలి!

రౌడీ షీటర్లు, గంజాయి విక్రేతలు, పాత నేర స్తులపై పోలీసులు దృష్టి సారించారు. స్పెషల్ పార్టీ బృందాలను రంగంలోకి దింపారు. రౌడీ షీటర్ల పనులపై ఆరా తీస్తున్నారు. 8లో▸



ఘనంగా క్వారీ దుర్గాదేవి జాతర

మంచిర్యాల జిల్లాలో ఆదివారం నిర్వహించిన క్వారీ దుర్గాదేవి జాతరకు భక్తులు వేల సంఖ్యలో హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. 8లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.2 /27.5

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. గాలిలో తేమ కారణంగా ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ అవార్డు దరఖాస్తు గడువు పెంపు

మంచిర్యాలఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ఏటా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రదానం చేసే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 17 వరకు పొడిగించినట్లు డీఈవో యాదయ్య తెలిపారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అందించే అవార్డు కోసం అర్హులైన ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధి, పునరావాస పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

పాతమంచిర్యాల: జిల్లాలోని నిరుద్యోగులైన ట్రాన్స్‌జెండర్లు ఉపాధి, పునరావాసం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్ తెలిపారు. వివిధ రంగాలలో శిక్షణలో భాగంగా డ్రైవింగ్ ఫొటోగ్రఫీ, విడియోగ్రఫీ, బ్యూటీషియన్, జ్యూట్ బ్యాగుల తయారీ, టైలరింగ్, లాజిస్టిక్ రంగాలలో శిక్షణ ఇస్తామని వివరించారు. ఆసక్తి గల ట్రాన్స్‌జెండర్లు www.wdsc.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 040–24559050 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

దివ్యాంగుల ఆర్థిక స్వావలంబనకు..

పాతమంచిర్యాల: దివ్యాంగులు ఆర్థిక స్వావలంబన ద్వారా సాధారణ జీవనం సాగించేందుకు వ్యవసాయ అనుబంధ పరిశ్రమ, సేవ, వ్యాపారం స్థాపించుకుని జీవనోపాధి పొందాలనే లక్ష్యంతో దివ్యాంగులకు ప్రభుత్వం ఉపాధి, పునరావాస పథకం అమలు చేస్తుందని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి రౌఫ్‌ఖాన్ తెలిపారు. ఈ పథకం కింద బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా రూ.50 వేలతో 50 యూనిట్లు, బ్యాంకు లింకేజీతో రూ.లక్ష, రూ.2 లక్షలు, రూ.3 లక్షలతో 28 యూనిట్లు మంజూరు చేయడం జరిగుతుందని పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో లబ్ధిదారుల ఎంపిక ఆన్‌లైన్‌లో జరుగుతుందని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్నవారు www.tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఈనెల 14 నుంచి 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు వైకల్యం కనీసం 40 శాతంపైబడి ఉండాలి. 21 నుంచి 55 ఏళ్ల లోపువారు అర్హులు. అభ్యర్థుల వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు ఉండాలని తెలిపారు. 5 ఏళ్లలో ఈ పథకం కింద లబ్ధి పొందకుండా ఉండాలని పేర్కొన్నారు. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుంటాని, సాంకేతిక పరిపక్వత కలిగిన దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. దరఖాస్తు సమయంలో సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఇటీవల తీసుకున్న ఆదాయ ధ్రువీకరణ పత్రం, కులం, నివాస ధ్రువీకరణ, వయస్సు నిర్ధారణ పత్రాలు, విద్యార్హత సర్టిఫికెట్‌లు పాస్‌పోర్టు ఫొటో జత చేయాలని తెలిపారు.

ముగిసిన పెన్కాక్ సిలాట్ శిక్షణ



పెన్కాక్ సిలాట్ క్రీడాకారులు

నస్పూర్: స్థానిక సాధన స్పోర్ట్స్, డిఫెన్స్ అకాడమీలో నిర్వహించిన పెన్కాక్ సిలాట్ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి అంతర్జాతీయ క్రీడాకారుడు, తెలంగాణ రాష్ట్ర పెన్కాక్ సిలాట్ కార్యదర్శి సతీశ్‌గౌడ్ హాజరై జిల్లా క్రీడాకారులకు మెలకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్రీడకు సంబంధించిన సర్టిఫికెట్స్‌కు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్ ఉంటుందన్నారు. రానున్న రోజుల్లో ఈ క్రీడకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు కోసం కృషి చేయాలన్నారు. ఈ శిక్షణలో సుమారు 50 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా పెన్కాక్ సిలాట్ చైర్మన్ రంగ రమేశ్, అధ్యక్షుడు పోచంపల్లి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి కొండబర్తి సందీప్, కోశాధికారి మోయిస్‌ఖాన్, ఉపాధ్యక్షుడు రంగు శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ ఆకుతోట నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామి..

- నాకు మధిర ఎంతో.. మంచిర్యాల అంతే
- ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- పరిశ్రమలకు, పెట్టుబడులకు అవకాశాలు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- జిల్లాలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం
- నలుగురు మంత్రుల రాకతో పండుగ వాతావరణం



రెబ్బెనపల్లిలో సభావేదికపై ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహతో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

దండేపల్లి/ జన్నారం/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/లక్సెట్టిపేట: మంచిర్యాల జిల్లా అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంచిర్యాల జిల్లా పరిశ్రమల స్థాపన, పెట్టుబడులకు పుష్కల అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నా రు. లక్సెట్టిపేటలో నిర్మించిన 50 పడకల సామాజిక ఆస్పత్రి, కళాశాల భవనాన్ని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుతో కలిసి ప్రారంభించారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లిలో ఇందిరా మహిళా శక్తి సౌర విద్యుత్ ప్రాజెక్టు, హాజీపూర్ మండలం వేంపల్లిలో 212 ఎకరాల్లో నిర్మించే దత్తసాయి ఇండస్ట్రీయల్, ఐటీ, ఆటోనగర్ పార్కుల పనులకు శంకుస్థాపన చేశారు. నలుగురు మంత్రుల రాకతో జిల్లాలో పండుగ వాతావరణం కనిపించింది.

ప్రజల మద్దతుతో ముందుకు..

మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజల మద్దతు, నమ్మకంతోనే ముందుకు సాగుతున్నానని, వారి శ్రేయస్సు కోసం జీవితాంతం కృషి చేస్తానని అన్నారు. ఇంద్రవెల్లి, నస్పూర్‌లో జరిగిన బహిరంగ సభలకు లక్షలాది మంది హాజరై మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దండెపల్లి మండలంలో నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ల మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కార్యక్రమంలో టీజీఐఐసీ వైస్ చైర్మన్, ఎండీ కే.శశాంక్, అటవీ శాఖ కన్జర్వేటర్, ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం, జిల్లా అటవీ శాఖా అధికారి శివ్ ఆశిశ్‌సింగ్, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, కలెక్టర్ కుమార్ దీపక్, ఎఫ్‌డీవో సర్వేశ్వర్, లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాష్, వైద్యవిధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, సూపరింటెండెంట్ హరీశ్‌చంద్రారెడ్డి, శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ కోటేశ్వర్ డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి, ఐఎన్‌టీయూసీ నేతలు జనక్‌ప్రసాద్, ప్రేమ్‌చంద్, శ్రీనివాస్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మధిరతో సమానం..

మంచిర్యాల జిల్లాను తన సొంత నియోజకవర్గం మధిరతో సమానంగా భావిస్తూ రాష్ట్రంలో రోల్‌మాడల్‌గా నిలిపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రెబ్బెనపల్లిలో ఇందిర మహిళా శక్తి సోలార్ ప్రాజెక్టు ప్రారంభోత్సవం అనంతరం మాట్లాడారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పనులను తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. మంచిర్యాలలో 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, లక్సెట్టిపేటలో 50 పడకల ఆస్పత్రి, కళాశాల భవన నిర్మాణం పూర్తయినట్లు తెలిపారు. ఎమ్మెల్యేప్రేమ్‌సాగర్‌రావు కోనట్లుగా దండెపల్లి మండలంలో మూడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, 220, 400 మెగావాట్ల సబ్‌స్టేషన్లు దశలవారీగా నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి సమక్షంలో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

విద్యార్థులతో కలిసి భోజనం..



భోజనం చేస్తున్న మంత్రులు, కలెక్టర్, ఎమ్మెల్యే

లక్సెట్టిపేట: పట్టణంలో సామాజిక ఆస్పత్రి, ప్రభుత్వ కళాశాల భవనాల ప్రారంభోత్సవం తర్వాత మంత్రులు పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు. పాఠశాలలో సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులలోని బెంచీలపై కూర్చుని చిన్నానాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి విద్యార్థి వద్ద పుస్తకాన్ని తీసుకుని చదివారు. కళాశాల గదులన్ని తిరిగి చూశారు. విద్యార్థి సంఘం నాయకులు స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధికి నాంది..

మంచిర్యాలలో 300 ఎకరాల్లో ఐటీ, ఇండస్ట్రీయల్, ఆటోనగర్ పార్కుల ఏర్పాటుతో అభివృద్ధికి నాంది పడిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. మొదటి దశగా 240 ఎకరాల భూమిని సేకరించి, 212 ఎకరాల్లో ఈ పార్కుల నిర్మాణం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం రూ.30 కోట్ల నిధులను కేటాయించామన్నారు. ఇందుకు పరిశ్రమల శాఖ నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ పార్కుల ఏర్పాటుతో 2 వేల మందికిపైగా ఉపాధి లభిస్తుందని తెలిపారు. మంచిర్యాల జిల్లా హైదరాబాద్, నల్గొండ, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలతో సమానంగా అభివృద్ధి చెందుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ప్రశంసించారు. నిధుల సేకరణ, అభివృద్ధి పనుల సరళీకరణలో ఆయన చూపిస్తున్న చొరవ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపే దిశగా సాగుతోందని తెలిపారు.



ఇండస్ట్రీయల్, ఐటీ, ఆటోనగర్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రులు

ఆదర్శంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి..

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ, మంచిర్యాలలో నిర్మించిన 650 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో హైదరాబాద్ తో సమానమైన సౌకర్యాలతో రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు.



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రులు

పర్యాటకంగా అభివృద్ధి..

అబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడు తూ, మంచిర్యాల జిల్లాను పర్యాటక రంగంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కళాకారులకు చేయూతనిస్తామని హామీ ఇచ్చారు. రూ.2 కోట్లతో కళాభవనం నిర్మాణం చేపడతా మని తెలిపారు. హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ పంచాయ తీ పరిధిలోని కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్‌లో గాంధారీ ఖిల్లా సఫారీ కోసం రెండు నూతన వాహనాలను మంత్రులు ప్రారంభించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటిన మంత్రులకు అటవీ శాఖ అధికారులు జంతువుల ఫొటోలతో కూడిన ఫ్రేమ్‌లు జ్ఞాపికలుగా అందజేశారు.



వేంపల్లిలో జంగల్ సఫారీ వాహనాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క

అందుగులపేటలో సోలార్ ప్లాంట్



సభకు హాజరైన జనం

జన్నారం/ దండేపల్లి: దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో ఇందిరా మహిళాశక్తి సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు చేయూత నిస్తూ దండేపల్లి మండలం అందుగులపేట(వెల్గనూర్) గ్రామంలో 4 ఎకరాల విస్తీర్ణంలో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రోజుకు సుమారు 4,500 నుంచి 5 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని పేర్కొన్నారు. ఏడాదికి రూ.51 లక్షల ఆదాయం వస్తుందని వెల్లడించారు. నర్సింగాపూర్ గ్రామంలో రూ.1.63 కోట్ల సీఎస్ఆర్ నిధులతో 900 మీటర్ల సీసీ రోడ్డు నిర్మిస్తామని తెలిపారు. రూ.80 లక్షల ఉపాధి హామీ నిధులతో నాలుగు గ్రామపంచాయతీ భవనాలు, రూ.48 లక్షలతో నాలుగు అంగన్‌వాడీ భవనాల నిర్మిస్తామని పేర్కొన్నారు.

రూ.80 కోట్ల చెక్కులు పంపిణీ..

జిల్లాలోని 863 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా అందించే రూ.80 కోట్ల విలువైన చెక్కులను మంత్రులు పంపిణీ చేశారు. 8 మందికి ప్రమాద బీమా కింద మంజూరైన రూ.10 లక్షల చొప్పున చెక్కులు అందించారు. రుణ బీమాకు సంబంధించి రూ.73.37 లక్షలను 83 మంది సభ్యులకు అందజేశారు. వడ్డీ లేని రుణాలు 8,750 మందికి రూ.17,78 కోట్లు అందించారు.

కొత్త బొగ్గు గనులు రావాలి

- లేదంటే సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం
- కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

రామకృష్ణాపూర్: సింగరేణి కొత్త గనులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. కొత్త గనులు రాకపోతే సంస్థ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని అభిప్రాయపడ్డారు. రామకృష్ణాపూర్‌లోని ఆర్‌కే1 సుభాష్‌నగర్ కాలనీని ఆదివారం సందర్శించారు. కాలనీలో నెలకొన్న సమస్యలపై సీపీఐ నాయకులు మంత్రికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కొత్త గనుల ఏర్పాటు విషయమై తాను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడానని తెలిపారు. కేబినేట్ సమావేశంలోనూ కొత్త గనుల ఏర్పాటుపై చర్చించామన్నారు. మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు జరిపించాలని ఇప్పటికే న్యాయస్థానంలో అఫిడవిట్ వేసినట్లు చెప్పారు. కోర్టు తీర్పు రాగానే ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. సుభాష్‌నగర్‌లో ఓపెన్‌జిమ్, డ్రైనేజీలు, రోడ్లు నిర్మించాలని స్థానికులు కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి...

క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ ఆలయాన్ని మంత్రి వివేక్ ఆదివారం సందర్శించారు. ఈ నెల 20న బోనాల జాతర నిర్వహించనుండగా స్థానికులతో కలిసి జాతర పోస్టర్ ఆవిష్కరించారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. మైసమ్మ ఆలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి తీసుకురావాలని పలువురు మంత్రికి వినతిపత్రం అందించారు. అనంతరం నాయక్‌పోడ్ సంఘం నాయకులతో కలిసి మంత్రి గాంధారి ఖిల్లాను సందర్శించారు. కాలభైరవుడిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాయలింగు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, రఘునాథ్‌రెడ్డి, వొడ్నాల శ్రీనివాస్, సీపీఐ నాయకులు రామడుగు లక్ష్మణ్, మిట్టపెల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కాలభైరవుడికి పూజలు చేస్తున్న మంత్రి వివేక్

ప్రజలను ఇబ్బందిపెడితే.. నన్ను పెట్టినట్లే!

- అటవీ అధికారులపై బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్ ఆగ్రహం

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అటవీ శాఖ అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ''ప్రజలను ఇబ్బంది పెడితే, నన్ను ఇబ్బంది పెట్టినట్లే,'' అని హెచ్చరించారు. బెల్లంపల్లి మండలం పాత బెల్లంపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన వన మహోత్సవంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలు విన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక తెచ్చుకోకుండా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు.

రైతుల ఆందోళన..

అంతకుముందు, ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయం వద్ద బెల్లంపల్లి, నెన్నెల మండలాలకు చెందిన రైతులు ఆందోళనకు దిగారు. అటవీ అధికారులు తమ పత్తి పంటలను ధ్వంసం చేసి, వ్యవసాయం చేయకుండా వేధిస్తున్నారని తెలిపారు. కొందరు రైతులు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. ఈ సంఘటనలకు అటవీ అధికారులే కారణమని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. వనమహోత్సవానికి హాజరైన బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి పూర్ణచందర్, డెప్యూటీ రేంజ్ అధికారి గౌరి శంకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ''సక్రమంగా విధులు నిర్వహిస్తే స్వాగతం, లేకపోతే నమస్కారం చేసి పంపిస్తా,'' అని హెచ్చరించారు. ప్రజల ఇబ్బందులను డీఎఫ్‌ఓ, మంత్రికి తెలియజేస్తానని, ప్రజలను వేధించడం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేయడమేనని అన్నారు.



అటవీశాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే వినోద్

సహకరించకుంటే చర్యలు..

తన నియోజకవర్గంలో పోడు రైతులను, ప్రజలను ఇబ్బందులకు గురిచేయవద్దని అటవీ అధికారులకు స్పష్టం చేశారు. ''చెన్నూర్‌లో నా సోదరుడు (ఎమ్మెల్యే, మంత్రి గడ్డం వివేక్)కి ఒక రూల్, నాకు మరొక రూల్ ఎలా సమంజసం?'' అని ప్రశ్నించారు. అటవీ అధికారులు సహకరించాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ''ప్రజా సమస్యలను ప్రధానమంత్రికి కూడా చెప్పే దమ్ము నాకుంది,'' అని స్పష్టం చేశారు.

పోడు భూముల సమస్యల పరిష్కారానికి హామీ

పోడు భూముల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే, ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అటవీ అధికారులు నేరుగా రైతుల పంటలను ధ్వంసం చేయడం మానుకోవాలని ఆదేశించారు. ఇకముందు ఇలాంటి సంఘటనలు జరగకుండా చూడాలని సూచించారు.

నిరీక్షణకు తెర

- నేటి నుంచి రేషన్‌కార్డుల పంపిణీ
- జిల్లాలో 20 వేలకుపైగా కొత్త కార్డులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పన్నెండేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న వారి నిరీక్షణ ఫలించింది. సోమవారం నుంచి రాష్ట్ర ప్ర భుత్వం కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. సూర్యపేట జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లాంఛనంగా పంపిణీ ప్రారంభించనున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు కొత్త కార్డులు అందనున్నాయి.

ప్రజాపాలన నుంచి ఆన్‌లైన్ వరకు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజాపాల న, గ్రామసభలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. మొదట్లో గ్రామసభల్లో అర్హుల జాబితా వెల్లడి సమయంలో వివాదాలు తలెత్తడంతో పంపిణీ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ వేశారు. రేషన్ కార్డులు ప్రామాణికంగా సంక్షేమ పథకాల అమలు నేపథ్యంలో, వేలాది మంది దరఖాస్తులు దాఖలు చేశారు.

సన్న బియ్యం పంపిణీతో పెరిగిన దరఖాస్తులు..

ఏప్రిల్ నుంచి నుంచి ప్రభుత్వం రేషన్ కార్డుల పై దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. దీంతో రేషన్‌కార్డు దరఖాస్తుల సంఖ్య పెరిగింది. కొత్తగా వివాహమైన వారు, కుటుంబంలో విడిపోయిన వారు కూడా కొత్త కార్డుల కోసం ఆసక్తి చూపారు. పాత కార్డుల నుంచి పేర్లు తొలగించడం, కొత్త కార్డులు అందకపోవడం వల్ల చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన

కొన్ని రోజులుగా తహసీల్దార్ కార్యాలయాల్లో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది. దరఖాస్తుదారుల ఆర్థిక స్థితిగతులను 360 డిగ్రీల పోర్టల్, సామాజిక ఆర్థిక సర్వే వివరాలతో సరిపోల్చి పరిశీలిస్తున్నారు. క్షేత్రస్థాయి తని ఖీల అనంతరం, పౌరసరఫరాల శాఖ ఆమో దం పొందిన తర్వాత కొత్త కార్డులు జారీ అవుతున్నాయి. గత నెలలో కొందరు కొత్త కార్డుదారులు బియ్యం కూడా పొందారు.

అనర్హుల తొలగింపు..

అయితే, ఆర్థికంగా స్థితిమంతులైన కొందరికి కూడా రేషన్ కార్డులు ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. దీంతో మూడు నెలలుగా బియ్యం తీసుకోని వారిని గుర్తిస్తూ, అనర్హులను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

కొత్త రేషన్‌కార్డుల వివరాలు

మొత్తం దరఖాస్తులు	30,577
ఆమోదం పొందినవి	20,391
తిరస్కరించినవి	1,030
పెండింగ్‌లో ఉన్నవి	9,156

ఇప్పటికే ఉన్న రేషన్ కార్డులు
2,23,844 (మే వరకు)

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలక్రైం: మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్ ప్రధాన చౌరస్తాలో రూ.78 కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకే రాజకీయల్లోకి వచ్చానన్నారు. తాను అందరిలా మాటలు చెప్పి తప్పించుకునే రకం కాదని, ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తానన్నారు. రోడ్డు విస్తరణపై కొందరు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, రానున్న రోజుల్లో దీని ఫలితాలు ప్రజలు అనుభవిస్తారని పేర్కొన్నారు. 15 రోజులో టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని, డిసెంబర్31 వరకు రోడ్డు విస్తరణ పూర్తి చేయాలని తెలిపారు.



రోడ్డు విస్తరణ పనులుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బాసర: గోదావరి నది మొదటిఘాట్ వద్ద ఆదివారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మొదటిఘాట్ వద్ద మృతదేహం లభ్యమైందని, ఎలాంటి ఆనవాళ్లు లభించలేదన్నారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే బాసర పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. సదరు వ్యక్తి బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

రెండు దుకాణాల్లో దొంగతనం



సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామంలో గల రెండు దుకాణాల్లో ఆదివారం వేకువ జామున దొంగలు చోరీకి పాల్పడ్డారు. ద్విచక్ర వాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు మంకీ క్యాపులు ధరించి శ్రీ లక్ష్మి క్లాత్ స్టోర్, శ్రీ మహాలక్ష్మి మెడికల్ షాప్‌ల షెటర్ల తాళాలు పగలగొట్టి, రెండు దుకాణాల్లో రూ.2,500 నగదు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కలప పట్టివేత

కడెం: మండలంలోని నవాబ్‌పేట్ గ్రామ శివారులోని వ్యవసాయ భూముల్లో దాచిపెట్టిన కలప దుంగలను అటవీ అధికారులు కింగ్‌ఫిషర్, నుమానుద్దీన్‌లు శనివారం పట్టుకున్నారు. పట్టుకున్న కలప దుంగలను కడెం రేంజ్ కార్యాలయానికి తరలించారు. కలప దుంగల విలువ లెక్కించలేదని, కేసు విచారణలో ఉందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



గాయాలపాలైన నారాయణ

బేల: మండలంలోని టాక్లి రెవెన్యూ గ్రామ శివారులోని జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. బేలకు చెందిన పుసాం నారాయణ ఆదిలాబాద్ నుంచి బేలకు ద్విచక్ర వాహనంపై వస్తున్న క్రమంలో వెనకాల వస్తున్న ఓ గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. దీంతో నారాయణకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన రైతులు వెంటనే 108 ద్వారా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉంది.

బార్ అకౌంటెంట్‌పై దాడి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శివబార్‌లో అకౌంటెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ కలీమ్‌పై నలుగురు వ్యక్తులు శనివారం రాత్రి దాడికి పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. మద్యం తాగిన నలుగురు వ్యక్తులు అకౌంటెంట్‌తో గొడవపడి దాడికి దిగినట్లు పేర్కొన్నారు. శ్రీనివాస్ అనే వ్యక్తితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ Wanted Auto Driver Cum Delivery Boy 5 nos salary 15K+Accommodation & food, Sales Executives 5 nos 18K + Accommodation and food for FMCG Company at Jalpally Preference will be given for scooter owners Hyderabad. Ph: 8367676262, 9885624923, 8978662887 [HA-5441]

www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

రౌడీలూ.. తీరు మారాలి!

- కొరడా ఝుళిపిస్తున్న పోలీసులు
- రంగంలోకి స్పెషల్ బృందాలు
- పద్ధతి మార్చుకోకుంటే నగర బహిష్కరణ
- జిల్లాలో 234 మందికి హెచ్చరిక



జిల్లాకేంద్రంలో రౌడీషీటర్‌కు కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ భాస్కర్



జిల్లా కేంద్రంలో రౌడీషీటర్ల కోసం అర్ధరాత్రి పహారా కాస్తున్న పోలీసులు

మంచిర్యాల జిల్లాలో డివిజన్ల వారీగా రౌడీషీటర్లు..	మంచిర్యాల 82	జైపూర్ 31	బెల్లంపల్లి 121

మంచిర్యాలక్రైం: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో రౌడీషీటర్ల ఆగడాలపై పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నిఘా పెంచారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 234 మందిపై రౌడీషీట్లు ఉన్నాయి. జిల్లాలో ఇటీవల రౌడీషీటర్ల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. అంబర్ కిషోర్ ఝా బాధ్యతలు తీసుకున్న తర్వాత రౌడీ షీటర్లు, గంజాయి విక్రేతలు, పాత నేరస్తుల ఆట కట్టించేందుకు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేకంగా స్పెషల్ పార్టీ బృందాలను రంగంలోకి దింపారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలోని నిఘా వర్గాల ద్వారా రౌడీ షీటర్లు చేస్తున్న పనులపై ఆరా తీస్తున్నారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు..

రౌడీషీటర్ల ఆగడాలు, గంజాయి పాత నేరస్తుల అల్లర్లను అరికట్టేందుకు రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా 30మంది ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేశారు. అక్రమ దందాలు, సెటిల్‌మెంట్లు, గ్యాంగ్ దాడులు నిర్వహించే రౌడీ షీటర్ల ప్రభావం ఉండే ప్రాంతాల్లో సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. తమకు తాముగా మారితేనే రౌడీషీట్ తొలగిస్తామని, లేకుంటే పీడీయాక్ట్, నగర బహిష్కరణ చేస్తామని ఇప్పటికే పలువురు రౌడీ షీటర్లకు హెచ్చరికలు పంపారు. అమయాక ప్రజలను బెదిరింపులకు గురిచేస్తున్న రౌడీషీటర్ల జాబితా సిద్ధం చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు అందించారు. వీరి ఇళ్లపై డీసీపీ భాస్కర్ పర్యవేక్షణలో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు చేస్తూ వారి కదలికలపై నజర్ పెడుతున్నారు.

రాజకీయ రంగు..

రౌడీషీటర్లు మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి, తాండూర్, పెద్దపెల్లి జిల్లాల్లోని గోదావరిఖని, మంథని, ఎన్టీపీసీ పరిసర ప్రాంతాల్లో రియల్, వ్యాపార లావాదేవిల్లో, భూ వివాదాల్లో ఇటీవల రౌడీషీటర్ల జోక్యం పెరిగింది. కాగా కొంతమంది రౌడీషీటర్లను రాజకీయ నాయకులే పెంచి పోషిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కాగా పోలీస్ రికార్డుల్లో రౌడీ షీటర్లుగా గుర్తింపు పొందిన వారి ప్రవర్తనలో మార్పు తీసుకొచ్చేందుకు పోలీస్ ఉన్నతాధికారులు తరుచుగా రౌడీ షీటర్లు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

ఇలా చేస్తే రౌడీషీటే..

- కుట్రపూరితమైన ఆలోచనతో భూవివాదాల్లో జోక్యం చేసుకోవడం, దాడికి దిగడం, అల్లర్లు చేయడం.
- పంచాయతీల్లో తలదూర్చడం, దాడులు, కొట్లాటలు వంటి సంఘటనల్లో తరుచుగా పాలుపంచుకోవడం.
- సమాజంలో శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరించడం.
- ఆడవాళ్లను తరుచూగా వేధింపులకు గురిచేయడం.
- నిత్యం నేరపూరితమైన సంఘటనలకు పాల్పడడం.

నిరంతరం నిఘా..



రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు గ్యాంగ్ దాడులకు పాల్పడుతున్న వారిపై, పాత నేరస్తులు, రౌడీషీట్, గంజాయి నిందితులపై నిరంతరం నిఘా ఉంచాం. రౌడీ షీటర్లు వారి పద్ధతి మార్చుకోకపోతే నగర బహిష్కరణ చేస్తాం.

– ఎగ్గడి భాస్కర్, డీసీపీ, మంచిర్యాల

నిమ్స్‌లో గిరిజన బాలికకు మంత్రి పరామర్శ



బాలికను పరామర్శిస్తున్న మంత్రి లక్ష్మణ్‌కుమార్

లక్ష్మీకాపూల్: అనారోగ్యంతో బాధపడుతున్న గిరిజన విద్యార్థిని ఆత్రం త్రివేణిని హైదరాబాద్‌లోని నిమ్స్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం పరామర్శించారు. త్రివేణి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. ఆయన వెంట గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్, అదనపు సంచాలకులు వి.సర్వేశ్వర రెడ్డి, ఉప సంచాలకులు దిలీప్ పాల్గొన్నారు.

తలపై కర్ర పడడంతో..

త్రివేణి ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం కుంటాల గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ఆమె తండ్రి తులసీరాం తెలిపిన వివరాల ప్రకారం.. వేసవి సెలవుల్లో త్రివేణి తలపై కర్ర పడటంతో ఆమెకు గాయమవడంతో పాటు వాంతులతో సతమతమైంది. స్థానిక ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా మందులు ఇవ్వడంతో వాంతులు ఆగిపోయాయి. ఈ క్రమంలో గత నెల20 నుంచి పాఠశాల ప్రారంభం కాగా వెళ్లింది. ఈ నెల11న నైట్ స్టడీ సమయంలో ఆమె వాంతులు చేయడంతో పాటు తీవ్రమైన తలనొప్పితో బాధపడింది. దీంతో ఆమెను పాఠశాల సిబ్బంది నేరడిగొండ పీహెచ్‌సీకి, మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఈ నెల12న నిర్మల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా ఆమె మెదడులో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు గుర్తించారు. మెరుగైన వైద్య చికిత్సకు నిమ్స్‌కు రిఫర్ చేశారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



బీరువా పరిశీలిస్తున్న ఎస్సై జుబేర్

తానూరు: మండలంలోని బోంద్రట్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై షేక్ జుబేర్ తెలిపారు. ఎస్సై, బాధితులు తెలిపిన వివరాలు.. బోంద్రట్ గ్రామానికి చెందిన జంగ్మే సావిత్రిబాయి–నారాయణ దంపతులు ఆదివారం ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లారు. వ్యవసాయ పనులు ముగించుకుని సాయంత్రం ఆరు గంటలకు తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటికి ఉన్న తాళం పగులగొట్టి ఉండడం.. బీరువా తెరిచి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై షేక్ జుబేర్ అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. బీరువాలో నగదుతో పాటు బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం పట్టివేత



నిందితులతో పోలీసులు

వాంకిడి: మహారాష్ట్ర నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా వాంకిడి పోలీసులు శనివారం రాత్రి పట్టుకున్నారు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఆర్టీఏ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా మహారాష్ట్ర వైపు నుంచి అనుమానాస్పదంగా వస్తున్న కారును తనిఖీ చేశారు. కారులో మహారాష్ట్రకు చెందిన మద్యం 72 రాయల్‌స్టాగ్ ఫుల్ బాటిళ్లు, రెండువేల ఓసీ 90 ఎంఎల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ.1.4 లక్షలు ఉంటుందని తెలిపారు. మద్యం తరలిస్తున్న మహారాష్ట్ర, గడ్‌చాందూర్‌కు చెందిన సుదర్శన్, రాజేంద్ర పాపయ్యలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

సాత్నాల: విద్యుదాఘాతానికి గురై బావునే అశోక్ (56) అనే వ్యక్తి మృతిచెందిన సంఘటన భోరజ్ మండలం పెండల్వాడ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై గౌతమ్ పవర్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం రాత్రి కుటుంబ సభ్యులందరు భోజనం చేసి పడుకున్నారు. అశోక్ ముందురూమ్‌లో పడుకున్నాడు. అశోక్ కుమారుడు రవి రాత్రి 11 గంటల సమయంలో బాత్‌రూం వెళ్లేందుకు నిద్ర లేచాడు. అశోక్ రెండు కాళ్లు కూలర్ స్టాండ్‌కు తగిలి ఉన్నాయి. అనుమానం వచ్చిన రవి కరెంట్ ఆఫ్ చేసి చూడగా అశోక్ కరెంట్ షాక్‌తో మృతిచెంది ఉన్నాడు. రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని కొత్త కుమ్మర్‌వాడకు చెందిన వివాహిత నవీన అదృశ్యమైనట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. శనివారం ఇంట్లో భర్తతో గొడవ జరగడంతో తన ఇద్దరు పిల్లలను తీసుకొని నవీన ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మళ్లీ తిరిగి రాలేదు. దీంతో నవీన తల్లి శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఘనంగా క్వారీ దుర్గాదేవి జాతర



ఆలయ ఆవరణలోని నాగదేవత దర్శనంలో భక్తులు



అమ్మవారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

క్వారీ దుర్గాదేవి 54వ వార్షికోత్సవ జాతరకు భక్తులు వేలసంఖ్యలో హాజరయ్యారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గఢ్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధి ఎంసీసీ క్వారీలో ఏటా జరిగే ఈ జాతర అంగరంగ వైభవంగా సాగింది. ఆదివారం ఉదయం ఆలయ ఆవరణలో వేదమంత్రోచ్చారణల మధ్య చండీహోమం జరిపారు. భక్తులు దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో వాహనాలకు పూజలు జరుపుకున్న భక్తులు కోళ్లు, మేకలు బలిచ్చి అక్కడే వంటలు చేసుకున్నారు. దుర్గాదేవి దర్శన అనంతరం ఆలయ ఆవరణలోని పోచమ్మ, నాగదేవతలను కూడా దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు –రాజకుమారి దంపతులు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్ ఆధ్వర్యంలో ఏసీపీ ప్రకాశ్ పర్యవేక్షణలో మంచిర్యాల సీఐ ప్రమోద్, పలువురు ఎస్సైలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. – మంచిర్యాలరూరల్ (హాజీపూర్)



జాతరలో ఆలయ ఆవరణలో వాహన పూజల్లో భక్తులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పెళ్లిపీటలు ఎక్కాలని వచ్చి... పాడెక్కాడు..



ఘటనా స్థలంలో మృతదేహాలు



జశ్వంత్(ఫైల్)



లక్ష్మణ్(ఫైల్)

- వివాహం కోసం గల్ఫ్ నుంచి వచ్చిన యువకుడు
- శుభలేఖలు పంచేందుకు వెళ్తుండగా ప్రమాదం
- వరుడితోపాటు బావమరిది దుర్మరణం
- రెండు కుటుంబాల్లో విషాదం

ఖానాపూర్:పెళ్లి చేసుకునేందుకు ఎన్నో ఆశలతో అతను ఇటీవలే గల్ఫ్ నుంచి స్వదేశానికి తిరిగొచ్చాడు. ఈనెల 18న పెళ్లి కూడా నిశ్చయమైంది. ఎంతో సంతోషంతో పెళ్లి శుభలేఖలు పంచేందుకు తన బావమరిదితో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృతిచెందిన ఘటన ఆదివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో చోసుచేసుకుంది. సీఐ సీహెచ్ అజయ్, ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన చొప్పదండి లక్ష్మణ్(25)కు కడెం మండలం పెద్ద బెల్లాల్ పంచాయతీపరిధి ఎస్సీకాలనీకి చెందిన యువతితో ఇటీవల వివాహం నిశ్చయమైంది. ఈ నెల 18న వివాహం ఉండడంతో ఆదివారం నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో శుభలేఖలు పంచేందుకు జన్నారం మండలం మురిమడుగు గ్రామానికి చెందిన మేన బావమరిది పడిగెల జశ్వంత్(19)తో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈక్రమంలో ఖానాపూర్ పట్టణంలోని కుమురంభీం చౌరస్తా సమీపంలో వాహనం అదుపుతప్పి కల్వర్టు వద్ద కాలువలో పడ్డారు. దీంతో ఇద్దరి తలలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఖానాపూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. జశ్వంత్ తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా లక్ష్మణ్ పెళ్లి చేసుకునేందుకు ఇటీవలే గల్ఫ్ నుంచి వచ్చాడు.

రోడ్డు ప్రమాదం.. కుటుంబం ఛిన్నాభిన్నం



శంకర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సెకండ్ ఎస్సై



సాగర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న రాములు

- తండ్రి, పెద్ద కుమారుడు మృతి
- తల్లి, చిన్న కుమారుడికి తీవ్ర గాయాలు
- దేవాపూర్‌లో విషాదఛాయలు



సిడాం శంకర్ (ఫైల్)

కాసిపేట/లక్సెట్టిపేట: రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. కుటుంబంలోని తండ్రి, పెద్ద కుమారుడు మృతి చెందగా, తల్లి, చిన్నకుమారుడు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హృదయ విషాదకర ఘటన శనివారం చోటు చేసుకుంది. లక్సెట్టిపేట ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దండెపల్లి మండలం నెల్కివెంకటాపూర్ గ్రామం వందూర్‌గూడ తండాకు చెందిన సిడం శంకర్(37) దేవాపూర్‌లోని ఓరియంట్ సిమెంట్ కంపెనీ న్యూప్లాంట్‌లో లోడింగ్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. శనివారం తన తండ్రి దామును చూసేందుకు భార్య సుమిత్ర, ఇద్దరు కుమారులు సాగర్(13), సంతోష్‌లతో కలిసి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వస్తుండగా లక్సెట్టిపేట మండలం అంకతిపల్లి స్టేజీ సమీపంలో మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపునకు వస్తున్న కారు బైక్‌ను ఎదురుగా ఢీకొట్టింది. ప్రమాదంలో పెద్ద కుమారుడు సాగర్ అక్కడికక్కడే మృతి చెందగా శంకర్, సుమిత్ర, సంతోష్‌లకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులకు మంచిర్యాలలో చికిత్స అందించగా పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలో శంకర్ మృతిచెందగా భార్య, చిన్న కుమారుడు కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి తమ్ముడు సిడం జాకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



అపూర్వ కలయిక!

బోథ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1981 –82లో పదో తరగతి, 1982 –84లో ఇంటర్ చదివిన పూర్వ విద్యార్థులు ఒక్కచోట చేరిన అపూర్వ ఘటన ఆదివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. అపూర్వ సమ్మేళనంలో ఆనాటి విద్యార్థులు తమ విద్యాభ్యాసం రోజుల జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఈ సందర్భంగా తమ గురువులు నర్సింగ్‌రెడ్డి, నర్సారెడ్డి, రమేశ్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. భూమారెడ్డి, విజయ్, కాశీనాథ్, రమాకాంత్, దేవిదాస్, సదానందం, రమేశ్, విలాస్, సునీల్, అనురాధ, పద్మ, సునీత, ఎస్ఎస్ ఖాన్, మహేంద్ర, శివాజీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు. – బోథ్

50 ఏళ్ల తర్వాత..



బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం అట్టహాసంగా జరిగింది. 1974 –75లో పదో తరగతి చదివిన విద్యార్థులు 50 ఏళ్ల తర్వాత ఒక్కచోట చేరి భావోద్వేగానికి గురయ్యారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులకు పూలమాల వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు జి.వెంకటయ్య, మాధవి, ఉపాధ్యాయులు శ్రీహరి, కృష్ణారావు, సతీశ్, జగన్నాథరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. – బెల్లంపల్లి

చికిత్స పొందుతూ ట్రాక్టర్ డ్రైవర్ మృతి



కొండు సాగర్ (ఫైల్)

తాండూర్: పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. అచ్చలాపూర్ గ్రామానికి చెందిన కొండు సాగర్(24) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన సాగర్ ఈ నెల 10న తాగిన మైకంలో పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాగర్ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈ మేరకు సాగర్ తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రిమ్స్ డైరెక్టర్‌కు ఐఎస్‌బీ సర్టిఫికెట్



ఐఎస్‌బీ సర్టిఫికెట్‌తో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) సర్టిఫికెట్ అందుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏడాది పాటు ఐఎస్‌బీ కోర్సు నిర్వహించింది. ఇందులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లకు ఏడాది పాటు శిక్షణ ఇచ్చారు. ఆదిలాబాద్ రిమ్స్ నుంచి రిమ్స్ డైరెక్టర్ కోర్సును పూర్తి చేశారు. శిక్షణలో హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, నాణ్యమైన వైద్యసేవలు అందించడం తదితర అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఐఎస్‌బీ ప్రొఫెసర్ సారంగ్‌దేవ్ సర్టిఫికెట్‌ను అందజేశారు.